క్లుప్తంగా

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట అర్బన్ : రంజాన్ సందర్భంగా పట్టణంలోని జనగామ రోడ్డు నందు గల ఈద్గాలో ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి వసతి కోసం పైపులైన్ ఏర్పాటు, టెంట్లు, కుర్చీలు తదితర సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

ధ్యాన కేంద్రంలో యోగా, ధ్యాన శిక్షణ

అర్వపల్లి : అర్వపల్లిలోని ధ్యాన కేంద్రంలో ఆదివారం సూర్యాపేట శ్రీరామచంద్రమిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థల ఆధ్వర్యంలో యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సెంటర్ ప్రశిక్షకులు ఎంవీ రంగారావు, వెంకటయ్య, రాజు, అభ్యాసకులు శేఖర్, దావుల సైదులు, కూరం విద్యాసాగర్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా రాంబాబు



నాగారం : బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఫణిగిరి గ్రామానికి చెందిన ఎర్ర రాంబాబు నియమితులయ్యారు. ఆదివారం సూర్యాపేటలో జరిగిన బీఎస్పీ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దయాకరన్ మౌర్య చేతుల మీదుగా రాంబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీఎస్పీ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యం



తిమ్మాపురంలోని రేషన్ దుకాణానికి చేరిన సన్నబియ్యం బస్తాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని 17 రేషన్ దుకాణాలకు సన్నబియ్యం చేరాయి. మండలంలో మొత్తం 8,942 ఆహార భద్రత కార్డులు ఉండగా, వీటికి సంబంధించి 1,749 క్వింటాళ్ల సన్నబియ్యం రేషన్ దుకాణాలకు చేరింది. ఏప్రిల్ 1 నుంచి కార్డుదారులకు ఈ బియ్యం పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సన్నబియ్యాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.

పాస్టర్ మృతిని నిరసిస్తూ శాంతియుత ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చివ్వెంల : పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సామ్యేలు మాట్లాడుతూ పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రాజేష్, రవికుమార్ పాల్గొన్నారు.

మూసీనది క్వారీలో సీసీ కెమెరాల ఏర్పాటు



వంతెనకు బిగించిన సీసీ కెమెరా

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని మూసీనదిలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ క్వారీలో మొత్తం మూడు చోట్ల సీసీ కెమెరాలను బిగించారు. ఈ కెమెరాలను సంబంధిత కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఇక నుంచి ఎప్పటికప్పుడు ఈ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మఠంపల్లి : మఠంపల్లి మండలం కాల్వపల్లితండాలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బానోతు నాగరాజు, వైస్ చైర్మన్‌గా బానోతు రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భీముడునాయక్, కోశాధికారిగా బాబు నాయక్, కమిటీ సభ్యులుగా హనుమా, రంగా, బాలరాజు, హనుమంతు, కిషన్, బాలు, రూప్లా, చిన్నబాబు, కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రెండేళ్లుగా వెలగని హైమాస్ట్ లైట్లు

- విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం
- రాత్రివేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు



మద్దిరాలలో హైమాస్ట్ లైట్లు వెలగక అంధకారంగా మారిన జాతీయ రహదారి

మద్దిరాల : హైవేల వెంబడి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలుగకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మద్దిరాల మండలం గుండా నాలుగు జిల్లాలను కలుపుతూ 365 జాతీయ రహదారి వెళ్లింది. దీంతో మండలంలో వాహనాల రద్దీ పెరిగింది. సూర్యాపేట–వరంగల్, సూర్యాపేట–మహబూబాబాద్, సూర్యాపేట–నల్లగొండ ప్రజలు ఈ 365 జాతీయ రహదారి గుండా నిత్యం ప్రయాణిస్తుంటారు. అయితే రాత్రి సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు, మద్దిరాల మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లను అమర్చారు. కానీ వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రాత్రి వేళల్లో ఆయా గ్రామాల పరిధిలో హైవే అంధకారంగా ఉంటూ ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అంధకారంగా జాతీయ రహదారి



జాతీయ రహదారి వెంట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి రెండేళ్లు దాటింది. కానీ ఇంతవరకు వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. రాత్రి వేళల్లో హైవేపై అంధకారంగా ఉండి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావాలి. – ఉపేందర్, ఆటో డ్రైవర్, మద్దిరాల

ఇబ్బందులు పడుతున్నారు



మద్దిరాల, ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. అదే విధంగా హైవేపై మండల పరిధిలోని గ్రామాల ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, హైమాస్ట్ లైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. – బిజ్జంకి శ్రీరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ

పోరెల్ల దాసు ఆశయాల సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఎర్ర జెండా ముద్దుబిడ్డ పోరెల్ల దాసు ఆశయాల సాధనకు నిత్యం కృషి చేస్తామని సీపీఎం సీనియర్ నాయకుడు కడెం లింగయ్య అన్నారు. ఆదివారం తిరుమలగిరిలో ఆయన వర్ధంతిని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు కడెం లింగయ్య మాట్లాడుతూ భూస్వాములకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన నాయకుడు పూరెల్ల దాసు అని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు కదారి లింగయ్య, బీసీ సంఘం నాయకుడు బ్రహ్మం, సామాజిక నాయకుడు కొత్తగట్టు యాదగిరి, సీఐటీయూ మండల నాయకులు శీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, జయపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, అర్చకులు భీం పాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

గంగదేవమ్మ ఉత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక ఇస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది ఏటి ఒడ్డున ఉన్న గంగదేవమ్మ ఆలయ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే సామేల్‌కు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏప్రిల్ 2, 3 తేదీలలో గంగదేవమ్మ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, జలేందర్, మత్స్య సొసైటీ చైర్మన్ మామిడి విజయ్, చింతల సురేష్, గీస సత్తయ్య, భద్రయ్య, జానయ్య పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తిరుమలగిరి : శ్రీసీతారాముల నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. నిర్వాహకులు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, సామ ఆంజనేయులు, రాపాక సోమేష్, పాలెపు చంద్రశేఖర్, తునికి పాటి రాంబాబు, దారం వెంకన్న, గజ్జెల శేఖర్, ఈశ్వరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముందుస్తు అరెస్టులు చేయడం తగదు



అర్వపల్లి : అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : హుజూర్‌నగర్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం తగదని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. అలాగే 13 నెలల గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా సమస్యలను విస్మరిస్తోందని తెలిపారు. ఆయనతో పాటు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

అర్వపల్లి : హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండల బీఆర్ఎస్ నాయకులను ఆదివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు కట్టెల మల్లేష్, నాయకులు సుంకరి వెంకన్న, సురేష్, కేలోతు రవీందర్‌నాయక్, అంకిరెడ్డి సందీప్, సాయిని లక్ష్మణ్, బింగి సాయి తదితరులు ఉన్నారు.

మద్దిరాల : సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోకుండా వారిని పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల నాయకుడు గుండ్ల నాగయ్య, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గొల్కొండ మల్లేష్, తొనుకునూరి రమేష్, గుండ్ల మహేందర్, గుండ్ల నరేష్, చరణ్, నాని తదితరులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



కుక్కడంలో మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

మద్దిరాల : కుక్కడం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బర్పటి పెద్ద యాకయ్య గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.14వేల నగదు, 75 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మద్దెల కాశీం, మంగళపెల్లి రవి, జలగం అచ్చయ్య గౌడ్, బీసు పెద్ద వీరన్న, లింగంపెల్లి మలయ్య, మల్రిపెద్ద ఉప్పలయ్య, ముక్కాల సురేష్‌రెడ్డి, బీసు చిన్న వీరన్న, మల్రిపెద్ద ఉప్పలయ్య, చామకూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన మంగదుడ్ల సోమక్క శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా తాజా మాజీ జెడ్పీటీసీ కడియం ఇందిరా పరమేశ్వర్ ఆదివారం మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కరణల నిమిత్తం రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటభిక్షం, అనంతుల వెంకటయ్య, గద్దల సైదులు, చిప్పలపల్లి సోమయ్య, మంగదుడ్ల రమేష్, మంగదుడ్ల అంజయ్య, బైరబోయిన నర్సయ్య, చీమల నర్సయ్య, కడియం శ్యామ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



వేల్పుచర్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మంజూరు చేయించిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో కొంత పారిశుద్ధ్య సమస్య తీరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్జె రవి, చిక్కుల శేఖర్, గైగుళ్ల యాదయ్య, వీరయ్య, కె.జాని, అక్కెనపల్లి రమేష్, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనాలు సాహిత్యాభిరుచిని పెంపొందిస్తాయి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి

కోదాడ : తెలుగు సంవత్సరాదిన కవి సమ్మేళనాలు సాహిత్యాభిరుచిని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలోని రంగనిగుడిలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ ప్రతి సంవత్సరం ఇక్కడ కవి సమ్మేళనాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాదాపు 30మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. అనంతరం కవులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుడుగుంట్ల రంగయ్య, రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు మంత్రిప్రగడ భరతరావు, కోదాడ రచయితల సంఘం అధ్యక్షుడు పుప్పాల కృష్ణమూర్తి, కవి సమ్మేళన కన్వీనర్ ఎస్ఎస్.రావు, వేనేపల్లి శ్రీనివాసరావు, కొమరగిరి రంగారావు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడిని తయారు చేసి స్వీకరించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తాళ్లగడ్డ : శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



పెన్‌పహాడ్ : అనాజిపురంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితుడు, పాల్గొన్న భక్తులు



తాళ్లగడ్డ : శ్రీసంతోషిమాత ఆలయంలో నూతన దస్త్ర పూజలో పాల్గొన్న భక్తులు



నూతనకల్ : మిర్యాలలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం..



తుంగతుర్తిలో పంచాంగ శ్రవణం..



ఆత్మకూర్(ఎస్) : కోటపహాడ్‌లో..



అర్వపల్లి దేవాలయంలో..



తిరుమలగిరి : శివాలయంలో..



నాగారం : వర్ధమానుకోటలోని శివాలయంలో..



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..



ఆత్మకూర్(ఎస్) : పాతర్లపహాడ్‌లో..



అర్వపల్లి : సూర్యక్షేత్రంలో ఉగాది పచ్చడి పంపిణీ..



అర్వపల్లిలోని ఆలయంలో నక్షత్ర హారతి..



నాగారంలో పంచాంగ శ్రవణం..

కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం



అర్వపల్లిలోని ఐకేపీ కేంద్రానికి చేరిన ధాన్యం



వేల్పుచర్లలో హైవేపై పోసిన ధాన్యం రాశులు

- జాజిరెడ్డిగూడెం మండలంలో ఈసారి 24 కేంద్రాల ఏర్పాటు

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం అప్పుడే కేంద్రాలకు రావడం మొదలైంది. మరో 15 నుంచి 20 రోజులలో వరికోతలు మొదలు కానున్నాయి. ఈ యాసంగిలో ముందు సాగుచేసిన రైతులు అప్పుడే వరిచేలు కోస్తున్నారు. దీంతో ఈ ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 24 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4, మ్యాక్స్ ఆధ్వర్యంలో 2, రైతుసంఘాల ఆధ్వర్యంలో 1, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 4 చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతోంది. 365బీ హైవేపై వేల్పుచర్ల వద్ద ఇప్పటికే ధాన్యం రాశులు పోసి ఉంచారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


900 బస్తాల ధాన్యం



ఈసీజన్‌లో 900 బస్తాల ధాన్యం కాగా అర్వపల్లిలోని ఐకేపీ కేంద్రంలో పోసి ఉంచాను. అకాల వర్షాలు పడుతాయేమోనని ఆందోళన అవుతుంది. కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభిస్తే ఇబ్బందులు ఉండవు.

– కారింగుల నాగరాజు, రైతు, రామన్నగూడెం

సకాలంలో ప్రారంభించాలి



ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలి. ఆలస్యం చేస్తే రైతులకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయడానికి తగు ఏర్పాట్లు చేపట్టాలి.

– వజ్జె శ్రీనివాస్, జాజిరెడ్డిగూడెం

సీపీఎం కార్యకర్తలపై దాడులను ఖండిస్తున్నాం

సూర్యాపేట అర్బన్ : మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో సీపీఎం కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటును ప్రశ్నించిన సీపీఎం కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మోతె మండలంలో అరాచక శక్తులు పెరిగిపోతున్నాయని అన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మునగాల : మండల కేంద్రంలోని సాయిగాయత్రి విద్యానిలయంలో శనివారం రాత్రి పాఠశాల నాల్గవ వార్షికోత్సవాలను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, పాఠశాల చైర్‌పర్సన్ అర్వపల్లి ఉషారాణి, ఏటెలబోతు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వెండి తమలపాకుల దండ బహూకరణ



దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల పరిధిలోని శ్రీరంగాపురం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన కందిమల్ల నాగేశ్వరరావు కృష్ణవేణి దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి తమలపాకుల దండను బహూకరించారు. ఈ సందర్భంగా దాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లు ప్రసాద్, సభ్యులు ఉప్పలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.